RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 40 | జనవరి 15, 2026 | వెల : రూ.3-00

వేద న్యూస్ పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు సంక్రాంతి శుభాకాంక్షలు. 15వ తేదీ గురువారం పండగ సందర్భంగా మా కార్యాలయానికి సెలవు. కాబట్టి 16వ తేదీ పత్రిక వెలువడదు. తిరిగి 17వ తేదీ, శనివారం మీ ముందుకు...

- ఎడిటర్

# తెలుగు లోగిళ్లలో సంక్రాంతి సంబరం



- ☐ పల్లెల్లో మూడ్రోజులు పండుగ వాతావరణం
- ☐ బంధు మిత్రులతో సందడిగా మారిన గ్రామాలు
- ☐ ఓ వైపు పతంగుల జోరు.. మరో వైపు పందెం కోళ్ల హెూరు
- ☐ ఘనంగా భోగి వేడుకలు
- ☐ తెలుగు ప్రజలకు ప్రముఖుల శుభాకాంక్షలు
- ☐ జీవితాల్లో సిరిసంపదలు నిండాలని ఆకాంక్ష

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :**

తెలుగు లోగిళ్లలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పల్లె తల్లి కొత్త వెలుగులతో ముస్తాబైంది. తుంబుర వాయిద్యాలతో హరిదాసులు ముంగిట్లోకి వస్తుంటే పల్లెలు భక్తి పారవశ్యంలో మునిగిపోయాయి. సన్నాయి వాయిద్యాల నడుమ గంగిరెద్దుల ఆటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నగరాల నుంచి జనం పల్లె బాట పట్టడంతో ప్రతి గ్రామం బంధుమిత్రుల రాకతో కోలాహలంగా మారింది. మూడు రోజుల ఈ సంబరాల్లో మొదటి రోజైన 'భోగి' వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారుజామునే వేసిన భోగి మంటలతో పల్లెల్లో పండుగ వాతావరణం మొదలైంది. తెలుగు లోగిళ్లు అందమైన రంగువల్లికలతో, గొబ్బెమ్మలతో కళకళలాడుతున్నాయి. పిండివంటల ఘుమఘుమలతో ఇల్లు పండుగ సందడిని సంతరించుకున్నాయి. బంధువుల రాకతో ఇళ్లన్నీ సందడిగా మారాయి. ఒకవైపు పెద్దలంతా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ముచ్చట్లలో మునిగిపోతుండగా, మరోవైపు విందు వినోదాలు జోరుగా సాగుతున్నాయి.

**- నింగిలో పతంగులు.. నేలపై పందేలు**

పిల్లలు, యువత పతంగుల పోటీల్లో మునిగిపోయారు. బస్తీ నుంచి పల్లెల దాకా పతంగులు ఎగురవేస్తూ కేరింతలు కొడుతున్నారు. నింగిలో పతంగుల సందడి ఉంటే.. నేలపై కోడి పందేల జోరు కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా జిల్లాలతో పాటు, తెలంగాణలోని పలు పల్లెల్లో కూడా కోడి పందేలు విపరీతంగా సాగుతున్నాయి. లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు పందాలు కాస్తూ, ఈ పందేలను వీక్షించేందుకు జనం కిక్కిరిసిపోతున్నారు. ఇది కేవలం పందెం మాత్రమే కాదు, పౌరుషానికి ప్రతీకగా భక్తులు, స్థానికులు ఎంజాయ్ చేస్తున్నారు.

**- ప్రముఖుల శుభాకాంక్షలు**

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, రాజకీయ ప్రముఖులు తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భోగి మంటలు పాత కష్టాలను దహించి, కొత్త వెలుగులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ పండుగ రైతన్నల జీవితాల్లో సిరిసంపదలు నింపాలని కోరుకున్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పశువులను పూజిస్తూ, బంధుమిత్రులను కలుసుకునే ఈ సంక్రాంతి పండుగ తెలుగు వారి ఆత్మగౌరవానికి మరియు సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తోంది.

## తెలుగు ప్రజలకు సీఎం శుభాకాంక్షలు

- ఆనందంగా పండుగలు జరుపుకోవాలి
- ప్రతి ఇంటా భోగభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్ష

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



భోగి, సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్రాంతి అనేది తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ అని పేర్కొం టూ, ప్రతి ఇంటా ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షిం చారు. భోగి పండుగ కొత్త ఆరంభాలకు నాంది పలికే రోజు అని ముఖ్యమంత్రి తెలిపారు. పాత బాధలు, కష్టాలను విడిచిపెట్టి కొత్త ఆశలు, కొత్త కాంతులతో ముందుకు సాగాల్సిన సమయం ఇదని అన్నారు. ఈ పండుగ ద్వారా సానుకూల ఆలోచనలు, సామాజిక ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. సంక్రాంతి, కనుమ పండుగలు రైతాంగ జీవనంతో విడదీయరాని బంధం కలిగి ఉన్నాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పంట చేతికొచ్చిన ఆనందం ఈ పండుగల్లో ప్రతిబింబిస్తుందని, గ్రామీణ సంస్కృతి, తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు జరగాలని సూచించారు. ప్రజలందరూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంతోషంగా పండుగలను జరుపుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ సంక్రాంతి కాలం రాష్ట్ర ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షిస్తూ తన సందేశాన్ని వెల్లడించారు. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సైతం రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## మహా జాతరకు సర్వం సిద్ధం



- భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు
- ఈసారి మూడు కోట్ల మందికి పైగా వస్తారని అంచనా
- పనులను పర్యవేక్షించిన మంత్రి సీతక్క

**వేద న్యూస్, ములుగు:**

మేడారంలో జరగనున్న సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. జాతర ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని, తల్లుల దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టిందని ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఈసారి మహాజాతరకు సుమారు మూడు కోట్ల మందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని మిగతా 3వ పేజీలో..

## పండుగ వేళ పసిడి పరుగులు

- వెండి ధరలూ పైపైకి..
- 24క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,620 - కిలో వెండి రూ.3,07000



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

పండుగల వేళ బంగారం, వెండి కొనుగోళ్లు ఎక్కువగానే జరుగుతాయి. అయితే ఈ సమయంలోనే ధరలు ఒక్కసారిగా భారీగా పెరగడంతో వినియోగదారులు ఆశ్చర్యానికి గురయ్యారు. బులియన్ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు గణనీయంగా ఎగబాకి పండుగ కొనుగోళ్లపై ప్రభావం చూపుతున్నాయి. తాజా రేట్ల ప్రకారం 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై రూ.1000 పెరుగుదల నమోదై రూ.1,31,650కి చేరింది. అలాగే 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములకు రూ.1090 పెరిగి రూ.1,43,620గా కొనసాగుతోంది. వెండి ధరల పెరుగుదల మరింతగా కనిపించింది. కిలో వెండిపై ఏకంగా రూ.15000 పెరగడంతో ప్రస్తుతం రూ.3,07000 వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, డాలర్ మారకం విలువలో మార్పులు, దేశీయంగా డిమాండ్ పెరగడం వంటి కారణాలతో ధరలు ఒక్కసారిగా పెరిగాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ ధరలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సమానంగా అమల్లో ఉంటాయని బులియన్ మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ధరలు పెరగడంతో కొంతమంది కొనుగోళ్లను వాయిదా వేసుకుంటుండగా, మరికొందరు భవిష్యత్తులో ఇంకా పెరుగుతాయనే అంచనాతో కొనుగోళ్లు కొనసాగిస్తున్నారు.

## మహిళలపై వ్యక్తిత్వ దాడులు సరి కాదు

- విమర్శ పేరుతో క్రూరత్వం సహించం
- వారి గౌరవమే సమాజ భవిష్యత్‌కు పునాది
- సీపీ సజ్జనార్




**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

ప్రజాజీవితంలో విమర్శలు సహజమే అయినా, అదే పేరుతో మహిళలపై వ్యక్తిత్వ దాడులు చేయడం తీవ్రమైన తప్పిదమని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. మహిళ ప్రభుత్వ అధికారి అయినా, ప్రైవేట్ రంగంలో పని చేసే వృత్తిపరమైన మహిళ అయినా, గృహిణి అయినా వారిపై మాటల ద్వారా, మీడియా కథనాల ద్వారా లేదా సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేయడం సరికాదని, అది నిస్సందేహంగా క్రూరత్వమేనని ఆయన పేర్కొన్నారు. నేటి సమాజంలో మహిళలు పరిపాలన, పోలీసు వ్యవస్థ, పాలన, శాస్త్ర సాంకేతిక రంగం, ప్రజాజీవితం, మీడియా వంటి అనేక రంగాల్లో ముందుండి నాయకత్వం వహిస్తున్నారని సజ్జనార్ తెలిపారు. అంతేకాదు, ఇంటి బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వహిస్తూ, ఉద్యోగం, కుటుంబం, సమాజం మధ్య సమతుల్యత సాధిస్తున్నారని అన్నారు. అలాంటి మహిళల వ్యక్తిత్వంపై దాడి చేయడం అంటే మనం గర్వపడే సామాజిక పురోగతినే దెబ్బతీయడమేనని అభిప్రాయపడ్డారు. మన ప్రాచీన సంస్కృతి మహిళల గౌరవానికి ఉన్న విలువను స్పష్టంగా చెబుతుందని ఆయన గుర్తు చేశారు. ఇటీవల కొంతమంది మహిళా అధికారులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుని వ్యక్తిత్వ హననానికి పాల్పడటం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని సజ్జనార్ తెలిపారు. మహిళలను గౌరవించలేని సమాజం తన భవిష్యత్తునే బలహీనపరుచుకుంటుందని హెచ్చరించారు. మహిళలపై అవమానం, పక్షపాతం, వ్యక్తిత్వ దాడులను సమాజం ఏ మాత్రం సహించదని స్పష్టం చేస్తూ, మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిదేనని ఆయన వ్యాఖ్యానించారు.

# సామాజిక సమానత్వమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



**వేద న్యూస్, శాయంపేట:**

పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం సామాజిక సమానత్వం సాధన దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. బుధవారం భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్హులైన 57 మంది లబ్ధిదారులకు రూ.57,06,612 విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే వివిధ గ్రామాలకు చెందిన 32 మందికి రూ.10,50,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ప్రతి అర్హుడికి ఫలాలు అందేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. రాబోయే రోజుల్లో శాయంపేట నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శాశ్వత ఆధార్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రోకుల ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో పని చంద్ర, ఆర్ఐ రమేష్, మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, బాసాని చంద్రప్రకాష్, మారపెల్లి రవీందర్, చింతల ఉమారావిపాల్, చల్లా చక్రపాణి, చిందం రవి, కుక్కల తిరుపతి, నిమ్మల మహేందర్, వరదరాజు, గజ్జి ఐలయ్యతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# ముగ్గు మన సంస్కృతికి ప్రతీక

- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్
- రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం



**వేద న్యూస్, రేగోడ్:**

రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్ఞ కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా రేగోడ్ మండలం చౌదరిపల్లి గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పాల్గొని, ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముగ్గులు భారతీయ మహిళల సృజనాత్మకతకు నిలువెత్తు నిదర్శనమని అన్నారు. ఇంటి ముందు వేసే ప్రతి ముగ్గు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అలాగే రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని స్పష్టం చేస్తూ, హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, అతివేగాన్ని నివారించడం వంటి నిబంధనలు పాటిస్తే అనేక ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేగోడ్ ఎస్ఐ పోచయ్య, గ్రామ సర్పంచ్ రాయిపల్లి సురేందర్, గ్రామ పెద్దలు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## వైభవంగా గోదాదేవి-రంగ నాయకుల కల్యాణం

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండల కేంద్రంలోని ఆరు శతాబ్దాల చరిత్ర గల అతి పురాతన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో బుధవారం గోదాదేవి-రంగనాయకుల కల్యాణం వేద మంత్రాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవాన్ని అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణానికి ముందు కల్యాణదాతలు అడ్వకేట్ గట్ల విజయపాల్ రెడ్డి-సరోజన దంపతులు, దేవాలయ చైర్మన్ సామల బిక్షపతి-రాజమణి దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధన పూజ, కన్యాదానం వంటి క్రతువులు నిర్వహించి అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించారు. తదుపరి పెళ్లి కాని యువతి, యువకులతో స్వామివారికి తలంబ్రాలు పోయించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిన్నా కృపాకర్ రెడ్డితో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని విజయవంతం చేశారు.

# క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని జేఎన్సీ కాలనీలో కేపీఎల్ (కొత్తపల్లి లక్ష్మీప్రసాద్) మెమోరియల్ కప్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బుధవారం బోధన్ ఏసీపీ శ్రీనివాస్ చేతుల మీదుగా ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో మిర్జాపూర్ విన్నర్ టీమ్‌కు మొదటి బహుమతిగా రూ.20,111ను కొత్తపల్లి శశికిరణ్ అందజేశారు. రుద్రూర్ రన్నర్ టీమ్‌కు రెండో బహుమతిగా రూ.10,111ను కొత్తపల్లి రవికిరణ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణను పెంపొందిస్తాయని అన్నారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరి సునీత చంద్రశేఖర్, ఉపసర్పంచ్ షేక్ నిస్సార్, ఎస్సై సాయన్న, టోర్నమెంట్ నిర్వాహకులు రాథోడ్ శ్రీకాంత్, కొత్తపల్లి హేమంత్, దుర్కి సునీల్, డింపుల్, డి. సందీప్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వేంకటేశ్వర స్వామి-గోదాదేవి కల్యాణం

- విలాసాగర్ గ్రామంలో భక్తుల సందడి



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి-గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు. ఈ కల్యాణ మహోత్సవంలో విలాసాగర్ గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, గ్రామ పాలకవర్గ సభ్యులు, గట్టుబూత్కూర్ సర్పంచ్‌తో పాటు పాలకవర్గం, ఘర్షకుర్తి సర్పంచ్, అలాగే చిన్న ఆచంపెల్లి, పెద్ద ఆచంపెల్లి గ్రామాల పాలకవర్గాలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ముగ్గుల పోటీలు



**వేద న్యూస్, రుద్రూర్:**

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రుద్రూర్ మండలంలోని చిక్కడపల్లి గ్రామంలో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మచ్కూరి రమేష్, ఉపసర్పంచ్ పిట్ల కళ్యాణ్, పాలకవర్గ సభ్యులు కలిసి నిర్వహించారు. గ్రామ పంచాయితీ ఆవరణలో జరిగిన ఈ పోటీల్లో 25 మందికి పైగా మహిళలు, యువతులు, బాలికలు పాల్గొని రంగురంగుల ముగ్గులతో సందడి చేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి మచ్కూరి జ్వాలాశ్రీ, ద్వితీయ బహుమతి బేగరి మహిత్ర తేజశ్రీ, తృతీయ బహుమతి పిట్ల మహతి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కుర్మరాజు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దేవాపూర్‌లో పారిశుధ్య పనులు

**వేద న్యూస్, కాసిపేట:**



దేవాపూర్ గ్రామంలోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, చెత్త చెదారాన్ని గ్రామ సర్పంచ్ సిడాం రాందాస్ చొరవతో తొలగించారు. ట్రాక్టర్ సహాయంతో చేపట్టిన ఈ శుభ్రత చర్యల వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులు తొలగినట్లయింది. సంతకు వచ్చే ప్రజలు, వాహనదారులకు రాకపోకల్లో సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నామని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుంరం జనార్దన్, అరుణ్, రాజారెడ్డి, జయరాం, వంశి, అనిల్ పాల్గొన్నారు.

# వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట వాకర్స్ అసోసియేషన్ నూతన మండల కమిటీని బుధవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పరకాల రఘు, ఉపాధ్యక్షులుగా ఆరికిల్ల దేవయ్య, ప్రధాన కార్యదర్శిగా బంక రమేష్, కోశాధికారిగా గుడెపు వేమేందర్, కార్యవర్గ సభ్యులుగా పరికి రమేష్, కుక్కల రమేష్, బాసాని శ్రీహరి, మారపల్లి సుధాకర్, చెన్నబోయిన సారంగపాణి, గుడెపు హరికృష్ణ ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి జయశంకర్ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, శాయంపేట సర్పంచ్ చింతల ఉమా రవిపాల్, స్థానిక ఎస్ఐ జక్కుల పరమేశ్వర్, పరకాల వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ మారపెల్లి రవీందర్ హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పరకాల రఘు మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన జీవితం కోసం వాకింగ్‌ను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. చిన్న వయస్సులోనే బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి సమస్యలు పెరుగుతున్నాయని, అందువల్ల ప్రతిరోజూ ఉదయం వాకింగ్ తప్పనిసరిగా చేయాలని సూచించారు.

# ఆధార్ అప్‌డేట్ పేరిట సైబర్ మోసాలు

- నకిలీ లింకులు, సందేశాలపై అప్రమత్తంగా ఉండాలి
- తెలంగాణ పోలీసుల హెచ్చరిక

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలనే పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. ఇటీవల ఆధార్ అప్‌డేట్ పేరుతో నకిలీ సందేశాలు, లింకులు పంపిస్తూ మోసగాళ్లు ప్రజల వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ ఖాతాలను లక్ష్యంగా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆధార్ అప్‌డేట్ చేయాలంటూ వచ్చే లింకులు, మెసేజ్‌లు ఎక్కువగా నకిలీవేనని, వాటిపై క్లిక్ చేస్తే మొబైల్ హ్యాక్ కావడం, బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు కాజేయబడే ప్రమాదం ఉందని తెలిపారు. ముఖ్యంగా ఓటీపీ, ఆధార్ నంబర్, బ్యాంక్ వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పవద్దని సూచించారు. ఆధార్‌కు సంబంధించిన సేవలు కేవలం అధికారిక కేంద్రాలు లేదా ప్రభుత్వ ధృవీకృత వెబ్‌సైట్ల ద్వారానే జరుగుతాయని స్పష్టం చేశారు. అనుమానాస్పద సందేశాలు లేదా కాల్స్ వచ్చినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సైబర్ మోసాల నుంచి రక్షణకు జాగ్రత్తలే ఉత్తమ మార్గమని తెలంగాణ పోలీసులు తెలిపారు.

# పోలీస్ వర్సెస్ పొలిటికల్ క్రికెట్

- లక్ష్మీపూర్‌లో ఉత్సాహంగా క్రీడా సందడి




**వేద న్యూస్, చొప్పదండిలరామడుగు:**

రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో గ్రామ పంచాయితీ పాలకవర్గం, రామడుగు పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం గ్రామ శివారులో పోలీస్ వర్సెస్ పొలిటికల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ద్యావ అనంతరెడ్డి, ఎస్ఐ రాజు నేతృత్వంలో రెండు జట్లు పోటీపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ఎస్ఐ టీమ్ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విజయం సాధించిన పోలీస్ టీమ్‌కు సర్పంచ్, వార్డు సభ్యులు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమానికి గ్రామస్తులు హాజరై క్రీడలను ఆస్వాదించారు.

# విషం ఇవ్వడంతో కుక్కలు మృతి..

**వేద న్యూస్ కామారెడ్డి :**



జిల్లాలోని మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని పల్వంచ మండల కేంద్రంలో ఫరీద్‌పేట్, బండారం ఈశ్వర్‌పల్లి, భవానిపేట్, వాడి గ్రామాలలో 600కు పైగా వీధి కుక్కలను చంపేశారని ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ ఘటన పట్ల జంతు ప్రేమికులు, హక్కుల కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత గ్రామాలలో కొత్తగా ఎన్నికైన సర్పంచుల పర్యవేక్షణలో ఈ సామూహిక హత్య జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటన జరిగిన తర్వాత, జంతు హక్కుల కార్యకర్తలు మూల రజని, అనపోలు అనిత, భాను ప్రకాష్, గోవర్ధన్, తదితరులు మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా, కుక్కలను పూడ్చిపెట్టారని ఆరోపణలు వచ్చిన ప్రదేశాలను గుర్తించి, పంచనామా నిర్వహించారు. ఈ ఘటనపై జంతు సంక్షేమ సంఘాలు మాట్లాడుతూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని , జంతు సంరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి గడ్డం వివేకానంద
- క్యాతనపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



**వేద న్యూస్, మంచిర్యాల:**

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి వివేకానంద అన్నారు. బుధవారం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ రాజుతో కలిసి పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమృత్ పథకం కింద క్యాతనపల్లి మున్సిపాలిటీకి రూ.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని, పనులు సగానికి పైగా పూర్తయ్యాయని తెలిపారు. త్వరలోనే మిగిలిన పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా త్రాగునీరు అందిస్తామని చెప్పారు. అలాగే నివాస ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్ఫార్మర్లను ఇతర ప్రాంతాలకు మార్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది పెంచి మెరుగైన వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీతో పాటు వచ్చే నెల నుంచి పెన్షన్ల పంపిణీ చేపడతామని మంత్రి తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీకి రూ.15 కోట్ల నగర అభివృద్ధి నిధులు, డీఎంఎఫ్టీ, సీఎస్ఆర్ నిధులతో ప్రజాప్రయోజన పనులు చేపడతామని వెల్లడించారు.

# మహా జాతరకు సర్వం సిద్ధం

అంచనా వేస్తున్నామని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రవాణా, భద్రత, వైద్య సేవలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా వంటి అన్ని అంశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ జాతరను సజావుగా నిర్వహిస్తున్నాయని అన్నారు. మహాజాతర నిర్వహణకు మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మంది అధికారులు, సిబ్బందిని విధుల్లో నియమించామని మంత్రి తెలిపారు. వీరితో పాటు 2,000 మంది గిరిజన యువ వాలంటీర్లు కూడా భక్తులకు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. భక్తులకు మార్గనిర్దేశం చేయడం, రద్దీ నియంత్రణ, అత్యవసర సహాయం అందించడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించనున్నారని వివరించారు. గిరిజన సంప్రదాయాలు, ఆచారాలకు ప్రతీకగా నిలిచిన సమ్మక్క--సారలమ్మ మహాజాతరను భక్తి శ్రద్ధలతో, క్రమబద్ధంగా నిర్వహించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. తల్లీ దేవతల జాతరకు వచ్చే ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆమె తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలకు జనసేన సిద్ధం



**వేద న్యూస్ కరీంనగర్ :**

- అన్ని మున్సిపాలిటీల్లో పోటీ చేస్తాం
- యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉంది
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి ఆర్కే సాగర్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి జనసేన పార్టీ పూర్తిగా సిద్ధంగా ఉందని పార్టీ ప్రచార కార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి ఆర్కే సాగర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈసారి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో జనసేన పార్టీ అభ్యర్థులను బరిలోకి దించేందుకు నిర్ణయించినట్లు వెల్లడించారు. రాజకీయాల్లో యువరక్తం ఎక్కువగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆర్కే సాగర్ పేర్కొన్నారు. అప్పుడే నవసమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలను నేరుగా అర్థం చేసుకునే శక్తి యువతకు ఉంటుందని, అలాంటి యువ నాయకత్వాన్ని జనసేన పార్టీ ప్రోత్సహిస్తోందని చెప్పారు. నియోజకవర్గాల వారీగా పార్టీని బలోపేతం చేసే దిశగా అనేక మంది కొత్త వ్యక్తులను జనసేన పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు. కొత్తగా చేరిన వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికినట్లు పేర్కొన్నారు. స్థానిక స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 నియోజకవర్గాలకు చెందిన నాయకులు, జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీలో భారీ చేరికలు

- బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై 50 మంది నాయకుల చేరిక
- మేయర్ పీఠాన్ని బీజేపీకి ఇవ్వాలి - బండి సంజయ్



**వేద న్యూస్ కరీంనగర్ :**

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంతో స్మార్ట్ సిటీ నిధులు, అమృత్ నిధులు తదితర కేంద్ర పథకాల ద్వారా కరీంనగర్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. కరీంనగర్ 51వ డివిజన్‌కు చెందిన తాజా మాజీ కార్పొరేటర్ బండారు వేణు, బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ సాధినేని మునీందర్, కల్వకుంట్ల ప్రమోద్ రావు, గాజె శివరాం సహా సుమారు 50 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, పార్టీలో చేరిన వారందరికీ మనస్ఫూర్తిగా స్వాగతం తెలిపారు. కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధే బీజేపీ విధానాలకు ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కరీంనగర్ నగరాభివృద్ధి వేగంగా సాగుతోందని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌లో బీజేపీ అభ్యర్థులందరినీ గెలిపించి మేయర్ పీఠాన్ని బీజేపీకి ఇవ్వాలని కరీంనగర్ ప్రజలకు బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. ప్రజల మద్దతుతో కరీంనగర్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పారదర్శక పాలన, నిరంతర అభివృద్ధే బీజేపీ లక్ష్యమని బండి సంజయ్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు బీజేపీ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

# పతంగిని ఎగరేసిన హైడ్రా కమిషనర్

- కూకట్పల్లిలో ఘనంగా కైట్ ఫెస్టివల్
- చెరువుల అభివృద్ధి అంటే ఇలా ఉండాలని నిరూపణ



**వేద న్యూస్ హైదరాబాద్ :**

కూకట్పల్లి నల్లచెరువులో బుధవారం పండగ వాతావరణం నెలకొంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పతంగిని ఎగరవేయడంతో అక్కడి వాతావరణం ఉత్సాహంతో నిండింది. బాల్యం, యువకాళం జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పిల్లలు, యువకులతో కలిసి ఆయన పతంగిని ఎగరవేశారు. స్థానికుల ఆహ్వానం మేరకు నల్లచెరువు చెంత నిర్వహించిన కైట్ ఫెస్టివల్‌లో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 సెప్టెంబరులో నల్లచెరువు విస్తరణ పనులు ప్రారంభించినప్పుడు తీవ్ర నిరసనలు ఎదురయ్యాయని గుర్తు చేశారు. నేడు అదే ప్రదేశంలో పండగ వాతావరణం నెలకొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అక్రమ కబ్జాలతో 16 ఎకరాలకు కుంచించుకుపోయిన నల్లచెరువును 30 ఎకరాలకు విస్తరించామని తెలిపారు. 10 అడుగుల మేర పేరుకుపోయిన పూడికను తొలగించి చెరువును మురికి నుంచి విముక్తం చేశామని చెప్పారు. చెరువు లోతు పెంచడం ద్వారా పరిసర ప్రాంతాల్లో వరదలకు నియంత్రణ సాధిస్తున్నామని పేర్కొన్నారు. కేవలం పై మెరుగులు దిద్దడం కాకుండా, చెరువుల అభివృద్ధి అంటే ఇలాగే ఉండాలని నిరూపించామని అన్నారు. ఇప్పుడు చెరువును చూస్తే ఎంతో ఆహ్లాదకరంగా ఉందని, మరిన్ని అందాలు సమకూరుస్తున్నామని తెలిపారు. ఐదు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి వాకింగ్ చేస్తున్నామని పలువురు చెప్పడం చాలా ఆనందంగా ఉందన్నారు. నల్లచెరువు పరిధిలో షటిల్ కోర్టు, కమ్యూనిటీ హాల్, యోగ కేంద్రం, సైకిల్ ట్రాక్, పికిల్ బాల్ వంటి క్రీడా సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఇవన్నీ ప్రజలు ఉచితంగా వినియోగించుకునేలా ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. మరో 14 చెరువులను అభివృద్ధి చేస్తామని కమిషనర్ వెల్లడించారు. హైడ్రా మొదటి విడతలో ఆరు చెరువుల అభివృద్ధి పూర్తయ్యిందని, ఇప్పటికే బతుకమ్మకుంటను ప్రారంభించామని చెప్పారు. మరో మూడు చెరువులను ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. వీటికి తోడు ప్రభుత్వం నిర్దేశించిన మరో 14 చెరువుల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. నగరంలో వంద చెరువులు అభివృద్ధి అయితే వరదల సమస్యను చాలా వరకు నియంత్రించవచ్చని అభిప్రాయపడ్డారు. మురికి కూపాలుగా ఉన్న చెరువులను ఆహ్లాదకరంగా మార్చడం ద్వారా భూగర్భ జలాలు పెరగడమే కాకుండా, మంచి నీరు అందుబాటులోకి వస్తుందని అన్నారు. చెరువులు వేడుకలకు వేదికలవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చెరువు ఈ స్థాయిలో అభివృద్ధి అవుతుందని ఊహించలేదని, ఇప్పుడు చూస్తే ఎంతో సంతృప్తిగా ఉందని స్థానికులు తెలిపారు. దుర్గంధభరితమైన వాతావరణాన్ని తొలగించి ఆహ్లాదాన్ని నింపిన హైడ్రాకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు, స్థానికులకు కమిషనర్ మిఠాయిలు పంచారు.

# చెరువులో రొయ్యపిల్లల విడుదల

**వేద న్యూస్ సిద్దిపేట :**



మత్స్య అభివృద్ధి మరియు స్టేట్ సెక్టార్ పథకం కింద 100 శాతం రాయితీపై శనిగరం చెరువులో రొయ్యపిల్లలను విడుదల చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మత్స్యకారుల ఆదాయం పెంపొందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడు తూ, చెరువులు, జలాశయాలను సద్వినియోగం చేసుకొని మత్స్య ఉత్పత్తిని పెంచడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. రొయ్యల పెంపకం ద్వారా మత్స్యకారులకు తక్కువ సమయంలో మంచి ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట గ్రంథలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలా జయరాజ్, శనిగరం సర్పంచ్ లింగంపల్లి లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు. మత్స్య సొసైటీ నాయకులు, సంబంధిత శాఖ అధికారులు, స్థానిక ముఖ్య నేతలు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పథకాల ద్వారా చెరువుల అభివృద్ధి, మత్స్య సంపద పెంపుదల, ఉపాధి అవకాశాల సృష్టికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# ‘వైల్డ్ వాటర్స్’ లో సంక్రాంతి సందడి..



**వేద న్యూస్ హైదరాబాద్ :**

హైదరాబాద్ జంట నగరాల వాసులు సంక్రాంతిని మరింత ఆనందంగా జరుపుకొనేందుకు కొత్త వేదిక సిద్ధమైంది. హైదరాబాద్ లోని అతిపెద్దవాటర్ ఉ అమ్యూజ్మెంట్ థీమ్ పార్క్ అయిన వైల్డ్ వాటర్స్ సరికొత్త ఆఫర్ ను ప్రకటించింది. ఈ నెల 12 నుంచి 18 వరకు ప్రత్యేక డిస్కౌంట్ తో ఈ ఆఫర్ అందుబాటులో ఉండనుంది. రూ.1,590 ఉండే టిక్కెట్ ధర ఈ వారంపాటు రూ.1010కి తగ్గించింది.టిక్కెట్ ధర తగ్గినప్పటికీ.. అదే ఎంజాయ్మెంట్, ఎంటర్ టైన్మెంట్ పొందొచ్చు. ఈ ప్యాకేజీలో 50కిపైగా అన్ లిమిటెడ్ యాక్సెస్ వాటర్ రైడ్స్, వేవ్ పూల్స్, థ్రిల్ రైడ్స్, లైవ్ డీజే, హార్ట్-రేసింగ్ వాటర్ స్లైడ్స్ వంటి సదుపాయాలున్నాయి. అలాగే సంక్రాంతి అంటే కైట్ ఫెస్టివల్. అందుకే ఇక్కడ కైట్ ఫెస్టివల్ కూడా ఏర్పాటు చేశారు. రోజంతా లైవ్ డీజే, మ్యూజిక్ తో డాన్స్ చేస్తూ ఎంజాయ్ చేయొచ్చు. ఫ్యామిలీ ఫ్రెండ్లీ వాతావరణం ఉంటుంది. పిల్లల ఆనందం కోసం ప్రత్యేక ఫీచర్స్ ఉన్నాయి. దీంతో పిల్లలు, పెద్దలు కలిసి కుటుంబమంతా ఇక్కడ హాయిగా సేదతీరొచ్చు. ఇక ఇందులోని ఫుడ్ కోర్టుల్లో ఉండే దేశీయ, విదేశీ వంటకాలతో అదిరే రుచుల్ని ఆస్వాదించవచ్చు. పార్క్ అంతా పండుగ నేపథ్యంలో ప్రత్యేక అలంకరణ చేశారు. దీంతో ఇక్కడ సంక్రాంతి వాతావరణం కనిపిస్తోంది. సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ముందుగానే ఆన్ లైన్ లో టిక్కెట్లు బుక్ చేసుకోవడం మంచిది. పూర్తి వివరాలు, టికెట్ల బుకింగ్ కోసం www.wildwaters. ను సందర్శించండి.

# సారే రావాలి..రైతు బంధు కావాలి

**వేద న్యూస్ ఊట్కూర్ :**




తెలంగాణ సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై అచంచల విశ్వాసం నానాటికి పెరుగుతుంది. పదేళ్లపాటు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసి దేశంలోనే నంబర్‌వన్ సీఎంగా గుర్తింపు తెచ్చుకున్న కేసీఆర్ మరోసారి అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటి ఎదుట ముగ్గులు వేసి అభిమానాన్ని చాటుకున్నారు.తెలంగాణలో మళ్లీ రైతుల జీవితాలు బాగుపడాలంటే సారే రావాలి.. రైతు బంధు కావాలి అంటూ నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం తిప్రాస్ పల్లి మాజీ సర్పంచ్ సుమంగళ ఇంటి ఎదుట వేసిన ముగ్గు విశేషంగా ఆకట్టుకుంది. మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు బుధవారం తెల్లవారుజామున రంగురంగులతో ముగ్గులు వేసి, జై కేసీఆర్.. జై చిట్టెం రామన్న.. అంటూ నినాదాలతో కూడిన ముగ్గులు వేసి నాయకుడు, బీఆర్ఎస్‌పై ఉన్న ప్రేమను చాటుకున్నారు.

వేద న్యూస్

గురువారం జనవరి 15, 2026

# గాలిపటాల ఆటలో దాగి ఉన్న మానవ సంబంధాలు

- పండుగలతో ముడిపడిన సాంస్కృతిక వారసత్వం
- ప్రపంచాన్ని కలిపే భారతీయ ఆకాశోత్సవం

**వేద న్యూస్ డెస్క్:**

అంతర్జాతీయ గాలిపటాల దినోత్సవం అనేది కేవలం ఒక వినోద దినం మాత్రమే కాదు; ఇది మానవ సంబంధాలను మరింత బలపరిచే సామాజిక వేడుక. గాలిపటం చేతిలో పట్టుకున్న క్షణంలో వయస్సు తేడా మరిచిపోతుంది, హోదాలు కరిగిపోతాయి, అందరూ ఒకే ఆనందంలో లీనమవుతారు. పిల్లల ఉత్సాహం, యువత పోటీ తపన, పెద్దల అనుభవం – ఇవన్నీ కలసి ఈ దినాన్ని ఒక సమూహ అనుభూతిగా మారుస్తాయి. ఆకాశంలో ఎగిరే ప్రతి గాలిపటం మనసులోని ఒత్తిడిని తేలికపరుస్తూ, స్వేచ్ఛ భావనను గుర్తుచేస్తుంది.

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగతో గాలిపటాల ఆటకు విడదీయలేని సంబంధం ఉంది. పంటల కోత పూర్తై, రైతు ఇంటికి ధాన్యం చేరిన ఆనందం ఈ ఆటలో స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో మైదానాలు, నగరాల్లో ఇళ్ల పైకప్పులు – అన్నీ గాలిపటాల పండుగకు వేదికలుగా మారతాయి. కుటుంబ సభ్యులు ఒకే చోట చేరి, పనుల ఒత్తిడి మరిచి, కలిసి గాలిపటాలు ఎగరేయడం ద్వారా బంధాలు మరింత బలపడతాయి. ఈ ఆట ద్వారా తరం నుంచి తరానికి సంప్రదాయం మౌనంగా బదిలీ అవుతుంది.

గాలిపటాల దినోత్సవం పోటీ ఉత్సాహానికీ ప్రతీక. దారాలు కత్తిరించేందుకు వ్యూహాలు, గాలిని అంచనా వేసే నైపుణ్యం, ఓటమిని స్వీకరించే మనస్తత్వం – ఇవన్నీ జీవితానికి అవసరమైన పాఠాలే. గెలుపు క్షణంలో వచ్చే ఆనందం కంటే, ఓడిన తర్వాత కూడా చిరునవ్వుతో మళ్లీ ప్రయత్నించడమే ఈ ఆట నేర్పే అసలైన సందేశం. అందుకే గాలిపటాల ఆటను చిన్నపాటి జీవన పాఠశాలగా కూడా చెప్పవచ్చు.

భారత్‌లో గాలిపటాల వేడుకలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన ప్రాంతాల్లో గుజరాత్ ప్రముఖంగా నిలుస్తుంది. అక్కడ జరిగే అంతర్జాతీయ గాలిపటాల ఉత్సవాలు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. వివిధ దేశాల నుంచి కళాకారులు, నిపుణులు పాల్గొని తమ తమ దేశాల ప్రత్యేక గాలిపటాలను ప్రదర్శిస్తారు. ఈ వేడుకలు భారతీయ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయడమే కాకుండా, దేశాల మధ్య స్నేహబంధాన్ని బలపరిచే వేదికగా మారుతున్నాయి.

ఆధునిక కాలంలో డిజిటల్ జీవనశైలి పెరిగిన నేపథ్యంలో, గాలిపటాల దినోత్సవం ఒక అవసరమైన విరామంలా మారింది. మొబైల్, స్క్రీన్‌లకు పరిమితమైన జీవితాల నుంచి బయటకు వచ్చి, ఆకాశాన్ని చూస్తూ, గాలిని అనుభవిస్తూ, ప్రకృతితో అనుసంధానం పెంచుకునే అవకాశం ఈ దినం ఇస్తుంది. పిల్లల్లో శారీరక చురుకుదనం, పెద్దల్లో మానసిక ఉల్లాసం పెరగడంలో గాలిపటాల ఆట కీలక పాత్ర పోషిస్తుంది.

మొత్తానికి, అంతర్జాతీయ గాలిపటాల దినోత్సవం అనేది ఒక ఆటకే పరిమితం కాని గొప్ప సాంస్కృతిక సంఘటన. ఇది ఆనందాన్ని పంచుతుంది, స్నేహాన్ని పెంచుతుంది, ప్రపంచాన్ని ఒకే ఆకాశం కిందకు తీసుకువస్తుంది. ఆకాశంలో ఎగిరే గాలిపటాలు మన ఆశలు, కలలు, స్వేచ్ఛ కోరికలకు ప్రతీకలుగా నిలుస్తూ – మనుషుల మధ్య దూరాలను తగ్గించే నిశ్శబ్ద దూతలుగా మారుతాయి. ప్రత్యేకంగా సంక్రాంతి పండుగ కాలంలో ఈ దినానికి మరింత ప్రాధాన్యత ఏర్పడుతుంది. పంటల కోత అనంతరం రైతు కుటుంబాల్లో కనిపించే ఆనందం, సెలవుల వాతావరణం, గ్రామీణ--నగర జీవనాల్లో ఒకేలా కనిపించే ఉత్సవ ఉత్సాహం గాలిపటాల ఆటతో మరింత విస్తరిస్తుంది. ప్రతి ఇంటి పైకప్పు, ప్రతి మైదానం ఒక చిన్న పండుగ వేదికగా మారుతుంది. సంప్రదాయ విలువలతో పాటు ఆధునిక ఆలోచనలను కలిపే శక్తి ఈ వేడుకలో స్పష్టంగా కనిపిస్తుంది.

భారత్‌లో గాలిపటాల వేడుకలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిన రాష్ట్రాల్లో గుజరాత్ కీలకమైనది. అక్కడ జరిగే అంతర్జాతీయ గాలిపటాల ఉత్సవాల్లో వివిధ దేశాల నుంచి కళాకారులు, పర్యాటకులు పాల్గొని తమ తమ శైలులను ప్రదర్శిస్తారు. ఈ వేడుకలు భారతీయ సంప్రదాయాన్ని ప్రపంచానికి పరిచయం చేయడమే కాకుండా, సాంస్కృతిక మార్పిడికి వేదికగా నిలుస్తాయి. పర్యాటకం, స్థానిక ఉపాధి అవకాశాలు కూడా ఈ దినంతో పెరుగుతాయి.మొత్తానికి, అంతర్జాతీయ గాలిపటాల దినోత్సవం అనేది ఒక ఆటకే పరిమితం కాదు. ఇది మనుషుల మధ్య స్నేహాన్ని పెంచే రోజు, సంస్కృతిని ప్రపంచంతో పంచుకునే సందర్భం, ప్రకృతితో అనుసంధానాన్ని గుర్తు చేసే వేళ. ఆకాశంలో ఎగిరే ప్రతి గాలిపటం, మనసుల్లో ఆశలు, ఆనందాలు, కలలను కూడా ఎగరేసే శక్తిగా మారుతుంది.

# అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు సాగుతోంది

**వేద న్యూస్ అమరావతి:**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధే లక్ష్యంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం సరికొత్త ఆశలు, ఆకాంక్షలతో ముందుకు సాగుతోందని మంత్రి అనిత అన్నారు. భోగి పండుగ సందర్భంగా పాయక రావుపేటలో టీడీపీ కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి ఆమె భోగి వేడుకల్లో పాల్గొన్నారు. భోగి పండుగ అనేది వ్యవసాయ సంస్కృతికి ప్రతీకగా, అన్నదాత జీవితంతో విడదీయరాని అనుబంధం కలిగిన పర్వదినమని మంత్రి పేర్కొన్నారు. హరిదాసుల కీర్తనలు, బసవన్నల ఆటల నడుమ భోగి పర్వదినాన్ని ప్రజలతో కలిసి జరుపుకోవడం మరిచిపోలేని అనుభూతిగా నిలిచిందని తెలిపారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు ఈ వేడుకల్లో ప్రతిబింబించాయని అన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు సంప్రదాయాల పరిరక్షణ కూడా ప్రభుత్వ ధ్యేయమని మంత్రి అనిత స్పష్టం చేశారు. వ్యవసాయం, గ్రామీణ జీవనం, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యతను, పరస్పర అనుబంధాన్ని మరింత బలపరుస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు. చివరిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ పండుగ ప్రతి ఇంటా ఆనందం, సుభిక్షత నింపాలని మంత్రి ఆకాంక్షించారు.

# రైలు నుంచి జారిపడి ఆర్మీ సుబేదార్ మృతి

**వేద న్యూస్ వరంగల్ :**



రైలు ప్రయాణంలో ప్రమాదవశాత్తు జారిపడి భారత సైన్యంలో సుబేదార్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి మృతి చెందిన విషాదకర ఘటన వరంగల్ జిల్లాలో చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రానికి చెందిన సంతోష్ కుమార్ (48) పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఇండియన్ ఆర్మీ సుబేదార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీన ఆయన న్యూఢిల్లీ నుంచి చెన్నై వెళ్లే అండమాన్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెం. 16032)లో ప్రయాణిస్తున్నారు.అదే రోజు రాత్రి 10:40 గంటల సమయంలో రైలు కేసముద్రం – ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్యకు రాగానే సంతోష్ కుమార్ ప్రమాదవశాత్తు రైలు నుండి కిందకు జారిపడ్డారు. ?ఈ ప్రమాదంలోఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రైల్వే అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు వరంగల్ రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుని వద్ద లభించిన ఫోన్ నంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేసి, మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించి దర్యాప్తు చేపట్టారు.

# సీఎం బహిరంగ సభ ఏర్పాట్లు కట్టుదిట్టంగా పూర్తి చేయాలి



- నిర్మల్ ఎన్టీఆర్ మినీ స్టేడియం పరిశీలించిన మంత్రి
- సభ విజయవంతానికి లోటుపాట్లు లేకుండా చర్యలు

**వేద న్యూస్ నిర్మల్ :**

ఈ నెల 16న నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభకు అవసరమైన ఏర్పాట్లను కట్టుదిట్టంగా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి సభా స్థలాన్ని పరిశీలించారు. వేదిక ఏర్పాటు, భద్రత, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, శానిటేషన్ వంటి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. సభ విజయవంతానికి ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల సౌకర్యం, భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల అందుబాటు, వృద్ధులు – మహిళలకు ప్రత్యేక సౌకర్యాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని అధికారులు భరోసా ఇచ్చారు.

# భూత్పూర్ మున్సిపాలిటీలో రూ.10.50 కోట్ల అభివృద్ధి

- ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యం
- సమగ్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**వేద న్యూస్ మహబూబ్‌నగర్ :**



మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని భూత్పూర్ మున్సిపాలిటీలో రూ. 10.50 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహచర మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్ రె ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, భూత్పూర్ మున్సిపాలిటీని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, ఇతర పట్టణ వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. రూ. 10.50 కోట్లతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులు పూర్తయితే భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని మంత్రి అన్నారు. పట్టణాభివృద్ధి అనేది కేవలం నిర్మాణాలకే పరిమితం కాకుండా, ప్రజల రోజువారీ జీవితానికి ఉపయోగపడే విధంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ప్రతి ప్రాంతం సమానంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో నిధులు మంజూరు చేసి పనులు చేపడుతున్నామని చెప్పారు. భూత్పూర్ మున్సిపాలిటీని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

# ప్రతి ఇంటా సంక్రాంతి సౌభాగ్యం వెల్లివిరియాలి

- శాంతి--సామరస్యంతో రాష్ట్రంలో పండుగ వాతావరణం
- తెలుగువారందరికీ సర్వైశ్వర్యం కలగాలి
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**వేద న్యూస్ అమరావతి :**



సంక్రాంతి పండుగ అంటే భోగి మంటలు, గంగిరెద్దులు, రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, సంప్రదాయ పందాలు, కొత్త దుస్తులు, పిండి వంటలు మనసులో మెదులుతాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పల్లెలు పండుగ శోభతో కళకళలాడుతున్న ఈ తరుణంలో, ప్రతి ఇల్లు సౌభాగ్యంతో విలసిల్లాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆంధ్రప్రదేశ్ అంతటా ప్రశాంతత వెల్లివిరుస్తోందని, శాంతి – సామరస్యం ఉన్నచోట రోజూ పండుగ వాతావరణమే ఉంటుందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇటువంటి సానుకూల పరిస్థితుల్లో వచ్చే సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో ఆనందం, నమ్మకం, ఐక్యతను మరింత బలపరచాలని కోరారు. మహాసూర్యుడు మకరరాశిలో ప్రవేశించి ఉత్తరాయణ పుణ్యాన్ని ప్రసాదించే ఈ పవిత్ర పర్వదినం తెలుగువారందరికీ సర్వైశ్వర్యం, సమృద్ధి, శుభమంగళాలను అందించాలని ఆ సర్వేశ్వరుడ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రైతులు, కష్టజీవులు సంతోషంగా ఉండాలని, వారి శ్రమకు తగిన గౌరవం లభించాలని ఆకాంక్షించారు. చివరిగా, ఈ సంక్రాంతి ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు నింపాలని, రాష్ట్ర ప్రజలందరూ ఆనందంగా పండుగను జరుపుకోవాలని కోరుకుంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా జిల్లా కేంద్ర మార్పు అన్యాయం

- భోగి మంటల్లో జిల్లా మార్పు గెజిట్ ప్రతుల దహనం
- ప్రజలతో కలిసి వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి నిరసన

**వేద న్యూస్ రాయచోటి :**



రాయచోటి జిల్లా కేంద్రాన్ని మార్పు చేసిన ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలతో కలిసి వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రామాపురం మండలం సుద్దమల్ల గ్రామం, యర్రమరెడ్డి గారిపల్లెలోని తన నివాస ఆవరణంలో జిల్లా మార్పుకు సంబంధించిన గెజిట్ ప్రతులను భోగి మంటల్లో దహనం చేస్తూ ఆందోళన చేపట్టారు. ముందస్తు సమాచారం లేకుండా, ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా తీసుకున్న ఈ నిర్ణయం రాయచోటి ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిన చర్యగా ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, ఒకసారి ప్రకటించిన జిల్లాను దేశ చరిత్రలో ఎక్కడా, ఎప్పుడూ మార్పు చేసిన దాఖలాలు లేవన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటైన రాయచోటి జిల్లా కేంద్రాన్ని అకస్మాత్తుగా మార్పు చేయడం ప్రజల ఆశలను నాశనం చేసిన చర్యగా అభివర్ణించారు. ఈ నిర్ణయం పూర్తిగా ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేస్తూ, ఎటువంటి ముందస్తు నోటిఫికేషన్ లేకుండా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. కొంతమంది తెలిసీ తెలియని వ్యాఖ్యలు చేస్తూ జిల్లా కేంద్ర మార్పుపై వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడి వైఖరి ఏమిటని ప్రశ్నించడం అవివేకమని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. జిల్లాను ఇచ్చిన నాయకుడే వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడన్న సత్యాన్ని మరిచిపోవడం దురదృష్టకరమన్నారు. దేశ రాజధానిగా ఢిల్లీ ఉన్నట్టే, పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర రాజధానులు, జిల్లా కేంద్రాలు ఉంటాయని తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన రాయచోటి జిల్లా కేంద్ర స్థానంలో ఏమి చేసినా దానికి ధీటుగా ఏదీ రాదన్నారు. సంతోషంగా జరుపుకోవాల్సిన పండుగ రోజునే రాయచోటి ప్రాంత ప్రజలకు జరిగిన అన్యాయంపై నిరసన తెలుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రభుత్వానికి భగవంతుడు మంచి బుద్ధి ప్రసాదించాలని ప్రార్థిస్తూ, జిల్లా కేంద్ర మార్పు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, రాయచోటి జిల్లా కేంద్రంగా అన్నమయ్య జిల్లాను యథతథంగా కొనసాగించాలని శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

# విమానాశ్రయంలో బహుళ శాఖల మాక్ డ్రిల్

- ఉగ్రవాద ప్రతిఘటన ప్రణాళిక ఆధారంగా భద్రతా విన్యాసం
- భద్రతా బలగాల సమన్వయం, సిద్ధతకు పరీక్ష



**వేద న్యూస్ జబల్‌పూర్:**

ప్రస్తుత భద్రతా పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని జబల్‌పూర్ విమానాశ్రయంలో వార్షిక బహుళ శాఖల మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద ముప్పు ఎదురైన సందర్భాల్లో వివిధ శాఖల మధ్య సమన్వయం, స్పందన సామర్థ్యం, సిద్ధతను అంచనా వేసే లక్ష్యంతో ఈ విన్యాసాన్ని చేపట్టారు. విమానాశ్రయ భద్రత మరింత బలోపేతం కావాలనే ఉద్దేశంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఈ డ్రిల్ కొనసాగింది. విమానాశ్రయ టెర్మినల్ భవనంపై ఉగ్రదాడి ప్రయత్నం జరిగినట్లు ఊహాజనిత పరిస్థితిని సృష్టించి ఈ విన్యాసాన్ని నిర్వహించారు. భద్రతా సిబ్బంది తక్షణమే అప్రమత్తమై పరిస్థితిని నియంత్రించే చర్యలు చేపట్టారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రమాదకర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై కార్యాచరణను ప్రదర్శించారు. ఈ మాక్ డ్రిల్‌లో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సిబ్బందితో పాటు మధ్యప్రదేశ్ రాష్ట్ర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, ప్రాంతాన్ని సురక్షితంగా మార్చడం, ప్రజలను రక్షించడం వంటి అంశాల్లో ఇరు శాఖలు సమన్వయంతో పనిచేశాయి. వేగవంతమైన స్పందన, క్రమబద్ధమైన నిర్వహణ ఈ విన్యాసంలో ప్రధానంగా కనిపించాయి. భవిష్యత్తులో ఎదురయ్యే ఏవైనా భద్రతా సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఇలాంటి మాక్ డ్రిల్లులు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. విమానాశ్రయాల భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా ఈ తరహా విన్యాసాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# బహుళ రాష్ట్రాల్లో భారీ డ్రగ్స్ దాడి

**వేద న్యూస్ న్యూఢిల్లీ :**

డ్రగ్ అక్రమ రవాణా ముఠాలకు భారీ ఎదురుదెబ్బగా, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు 2026 జనవరి 11, 12 తేదీల్లో బహుళ రాష్ట్రాల్లో సమన్వయంతో చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో 270 కిలోల సింథటిక్ మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన మత్తు పదార్థాల విలువ సుమారు రూ.81 కోట్లుగా అధికారులు అంచనా వేశారు. ముందస్తు సమాచారం, గోప్యమైన నిఘా ఆధారంగా ఈ దాడులను పక్కా ప్రణాళికతో నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ మత్తు పదార్థాలను దేశీయంగా అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు, కోడి మేత కింద దాచిపెట్టి రవాణా చేస్తున్న తీరును గుర్తించారు. తనిఖీల నుంచి తప్పించుకునేందుకు డ్రగ్ ముఠా వినూత్న పద్ధతిని అవలంబించినట్లు అధికారులు తెలిపారు. సాధారణ సరుకుల ముసుగులో మత్తు పదార్థాలను తరలించడం ద్వారా భద్రతా తనిఖీలను మభ్యపెట్టే ప్రయత్నం చేసినట్లు స్పష్టం చేశారు. తదుపరి దశలో నిర్వహించిన సోదాల్లో పలు ప్రాంతాల్లో కీలక నిందితులను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసిన మత్తు పదార్థాల తయారీ, సరఫరాలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ముఠా సభ్యులే వీరని అధికారులు వెల్లడించారు. వీరి నుంచి కీలక సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో, రహస్యంగా ఏర్పాటు చేసిన మత్తు పదార్థాల తయారీ కేంద్రాన్ని కూడా అధికారులు గుర్తించారు. అక్కడ కొంత ముడి పదార్థం లభ్యమైనట్లు, తయారీ యంత్రాలు విడదీయబడి ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని, డ్రగ్ అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను పూర్తిగా ఛేదించేందుకు చర్యలు ముమ్మరం చేసినట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు.



## దుస్తులు మురికి అయ్యాయని.. కుమార్తెను కొట్టి చంపిన తండ్రి, సవతి తల్లి

**వేద న్యూస్ లక్నో:**

ఆడుకుంటుండగా బాలిక కాలువలో పడింది. ఆమె దుస్తులు మురికి కావడంపై తండ్రి, సవతి తల్లి ఆగ్రహించారు. ఆ చిన్నారిని దారుణంగా కొట్టారు. రాత్రంతా టెర్రస్‌పై చలిలో వదిలేశారు. ఆ బాలిక మరణించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. (ఖుబస్త్రష్ట్రవతీ దీమఘ్వఅ ఎశీ ణమఘ్ష్ర) ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. జనవరి 11న ఆరేళ్ల షిఫా తోటి పిల్లలతో కలిసి ఇంటి బయట వీధిలో ఆడింది. అయితే ప్రమాదవశత్తు డ్రైనేజీలో పడింది. దీంతో ఆ బాలిక దుస్తులకు మట్టి అంటుకోవడంతో మురికిమయంగా మారాయి.కాగా, షిఫా మురికి దుస్తులు చూసి తండ్రి అక్రమ్, సవతి తల్లి నిషా ఆగ్రహించారు. ఆ బాలికను దారుణంగా కొట్టారు. రాత్రంతా చలిలో టెర్రస్‌పై వదిలేయడంతో ఆ చిన్నారి మరణించింది. సోమవారం ఉదయం స్థానికులకు ఇది తెలిసింది. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మరోవైపు పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. బాలిక మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఆ చిన్నారి ఎముకలు విరుగడం, రక్తం గడ్డకట్టంతోపాటు శరీరంపై 13 గాయాలున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. మరణించిన మొదటి భార్య సంతానమైన ఆ బాలికను కొట్టి చంపిన తండ్రి అక్రమ్, సవతి తల్లి నిషాను బుధవారం అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సంక్రాంతి పంటల పండుగ కాదు

# భారతీయ జీవన తత్వం

- భూమి – మనిషి అనుబంధానికి ప్రతీక
- కుటుంబం – సమాజాన్ని ఒక్కటిగా కట్టే ఉత్సవం
- మారుతున్న కాలంలోనూ మారకూడని విలువలు

**వేద న్యూస్ డెస్క్:**

సంక్రాంతి భారతీయ సంస్కృతిలో అత్యంత లోతైన అర్థం ఉన్న పండుగ. ఇది కేవలం క్యాలెండర్‌లో వచ్చే ఒక తేదీ కాదు, ప్రకృతితో మనిషి కలిగి ఉన్న అనుబంధానికి జీవంత సాక్ష్యం. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే ఈ సమయంలో ప్రకృతి కొత్త శక్తిని సంతరించుకుంటుంది. రైతు ఏడాది పొడవునా భూమితో చేసిన పోరాటానికి ఫలితం దక్కే ఘడియ ఇదే. చెమట చిందించి పండించిన పంట గడప దాటే వేళ, ఆ ఆనందం ఇంటింటా పండుగగా మారుతుంది. అందుకే సంక్రాంతి అంటే పంటల పండుగ మాత్రమే కాదౌ అది శ్రమకు లభించే గౌరవం, భూమికి చేసే నమస్కారం.

గ్రామీణ జీవనంలో సంక్రాంతికి ఉన్న ప్రాధాన్యతను మాటల్లో చెప్పడం కష్టం. తెల్లవారుజామునే ఇళ్ల ముందు వేసే మగ్గులు, రంగవల్లులు కేవలం అలంకరణ కాదు – అవి ఆశ, శుభం, ఐశ్వర్యానికి సంకేతాలు. భోగి నాడు పాత వస్తువులను అగ్నికి ఆహుతి చేయడం వెనుక లోతైన తాత్విక భావన ఉంది. పాతదాన్ని విడిచిపెట్టి, కొత్త ఆలోచనలకు, కొత్త జీవనానికి స్వాగతం చెప్పాలన్న సందేశం అది. సంక్రాంతి నాడు సూర్యారాధన ద్వారా మనిషి ప్రకృతిపై ఆధారపడి ఉన్నాడనే సత్యాన్ని గుర్తు చేస్తారు. కనుమ నాడు పశుసంపదకు చేసే పూజ, వ్యవసాయ వ్యవస్థలో పశువుల పాత్ర ఎంత కీలకమో తెలియజేస్తుంది.

సంక్రాంతి పండుగలో కుటుంబ బంధాలకు ఉన్న విలువ అపారం. ఉద్యోగాలు, చదువులు, జీవన పోరాటాలతో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు ఈ పండుగకు స్వగ్రామాలకు చేరుకుంటారు. పెద్దల ఆశీర్వాదాలు, చిన్నారుల సందడి, బంధువుల కలయిక – ఇవన్నీ కుటుంబాన్ని తిరిగి ఒకటిగా కట్టిపడేస్తాయి. పొరుగింటికి పండుగ వంటకం పంపడం, పేదవాడితో పంచుకోవడం వంటి సంప్రదాయాలు సామాజిక సమానత్వాన్ని గుర్తు చేస్తాయి. కులం, మతం, వర్గం అనే గీతలు కొంతసేపైనా మసకబారే సందర్భం సంక్రాంతి.

అయితే ఆధునిక కాలంలో సంక్రాంతి రూపం మారుతోంది. పట్టణీకరణ, అపార్ట్‌మెంట్ సంస్కృతి, వేగవంతమైన జీవనశైలి కారణంగా పండుగ సారాన్ని పూర్తిగా అనుభవించలేని పరిస్థితి ఏర్పడుతోంది. పండుగ సెలవులు ఇప్పుడు గ్రామాలకు వెళ్లే అవకాశంగా కాకుండా, పర్యటనలకు పరిమితమవుతున్నాయి. రైతు కష్టాన్ని గుర్తు చేసే ఈ పండుగ, రైతు జీవితానికి దూరమవుతుందేమో అన్న ఆందోళన కూడా ఉంది. అయినప్పటికీ సంక్రాంతి మనకు ఒక కీలక ప్రశ్న వేస్తూనే ఉంది – మన మూలాలను మరిచిపోతున్నామా? ప్రకృతితో ఉన్న బంధాన్ని తెంచుకుంటున్నామా?

ఈ ప్రశ్నలకు సమాధానం వెతకడమే సంక్రాంతి యొక్క అసలైన ఉద్దేశం. భూమిని గౌరవించడం, శ్రమకు విలువ ఇవ్వడం, కుటుంబాన్ని కాపాడుకోవడం, సమాజంతో పంచుకోవడం – ఇవే ఈ పండుగ మనకు నేర్పే పాఠాలు. కాలం ఎంత మారినా, సాంకేతికత ఎంత ముందుకు వెళ్లినా ఈ విలువలు నిలిచినంతకాలం సంక్రాంతి వెలుగు తగ్గదు. అందుకే సంక్రాంతి ఒక సంప్రదాయం మాత్రమే కాదౌ అది భారతీయ జీవన తత్వానికి ప్రతిరూపం. ఈ పండుగలో కుటుంబం, సమాజం కేంద్రబిందువుగా నిలుస్తాయి. ఉద్యోగాలు, చదువులు, జీవన అవసరాల వల్ల పట్టణాలకు వెళ్లినవారు సంక్రాంతికి స్వగ్రామాలకు చేరుకుంటారు. పెద్దల ఆశీర్వాదాలు, చిన్నారుల సందడి, బంధువుల కలయిక – ఇవన్నీ కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయి. ఇళ్ల ముందరి మగ్గులు, పండుగ వంటకాలు, పక్కింటికి పంచే తీపి పదార్థాలు – ఇవన్నీ సామాజిక ఐక్యతకు ప్రతీకలు. కులం, వర్గం, సంపద అనే తేడాలు కొంతసేపైనా మసకబారే సందర్భం సంక్రాంతి. గ్రామాల్లో జరిగే హరిదాసు పాటలు, గంగిరెద్దుల ఆటలు, పల్లె క్రీడలు ప్రజలను ఒక్క వేదికపైకి తీసుకువస్తాయి. ఈ సమూహ ఆనందమే సంక్రాంతి అసలైన బలం. అయితే ఆధునిక కాలంలో సంక్రాంతి సారంపై కొన్ని ప్రశ్నలు ఎదురవుతున్నాయి. పట్టణీకరణ, అపార్ట్‌మెంట్ జీవితం, వేగవంతమైన జీవనశైలి కారణంగా పండుగ అనుభవం పరిమితమవుతోంది. పండుగ అంటే సెలవులు, ప్రయాణాలు, షాపింగ్‌గా మారిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. రైతు కష్టాన్ని గుర్తు చేసే ఈ పండుగలో రైతే కనుమరుగవుతున్నాడేమో అన్న ఆందోళన కలుగుతోంది. ఇలాంటి సమయంలో సంక్రాంతి మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది – అభివృద్ధి అనేది భూమిని మరిచిపోవడం కాదు, మూలాలను తెంచుకోవడం కాదు. శ్రమకు గౌరవం ఇవ్వడం, ప్రకృతిని కాపాడుకోవడం, కుటుంబాన్ని సమాజాన్ని బలోపేతం చేయడం – ఇవే నిజమైన అభివృద్ధి లక్షణాలు. అందుకే సంక్రాంతి ఒక సంప్రదాయం మాత్రమే కాదౌ అది భారతీయ జీవన తత్వాన్ని తరతరాలకు అందించే దీపం.


## చిన్న పొదుపే మహా భద్రతగా మారితే..

**వేద న్యూస్ డెస్క్:**

పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ పథకం ద్వారా తక్కువ మొత్తంతోనే భవిష్యత్తుకు గట్టి భద్రత ఏర్పరుచుకోవచ్చు. రోజుకు కేవలం 200 చొప్పున పొదుపు చేస్తే దీర్ఘకాలంలో 10 లక్షలకు మించి మొత్తం కూడబెట్టే అవకాశం ఈ పథకంలో ఉంటుంది. ప్రస్తుతం ఈ ఖాతాకు సంవత్సరానికి 6.7 శాతం వడ్డీ అందిస్తున్నారు. ప్రభుత్వ హామీ ఉండటంతో పెట్టుబడులకు పూర్తి భద్రత లభిస్తుంది. ఈ పథకంలో ఖాతా ప్రారంభించడానికి కనీసంగా 100 మాత్రమే సరిపోతుంది. మొదట 5 సంవత్సరాల కాలపరిమితితో ఖాతా తెరవచ్చు. అవసరమైతే మరో 5 సంవత్సరాల పాటు పొడిగించుకునే అవకాశం కూడా ఉంటుంది. ఖాతా తెరిచిన 1 సంవత్సరం తర్వాత డిపాజిట్ మొత్తంలో 50 శాతం వరకు రుణం పొందవచ్చు. ఈ రుణంపై కేవలం 2 శాతం వడ్డీ మాత్రమే వసూలు చేస్తారు. అలాగే 3 సంవత్సరాలా ఉంది. రోజుకు 200 చొప్పున 10 సంవత్సరాల పాటు పొదుపు చేస్తే మొత్తం డిపాజిట్ 7.20 లక్షలు అవుతుంది. దీనిపై సుమారు 2.05 లక్షల వడ్డీ వచ్చి మెచ్యూరిటీ సమయానికి మొత్తం 10.25 లక్షలు అందుతాయి. చిన్న పొదుపుతో పెద్ద లక్ష్యాన్ని చేరుకోవాలనుకునే వారికి ఈ పథకం మంచి అవకాశంగా నిలుస్తోంది.

## వన్‌ప్లస్ అధినేతకు అరెస్ట్ వారెంట్..!

**వేద న్యూస్ డెస్క్:**



ప్రముఖ చైనా స్మార్ట్‌ఫోన్ సంస్థ వన్‌ప్లస్ చిక్కుల్లో పడింది. ఆ సంస్థ అధినేత పీట్ లౌపై తైవాన్ అధికారులు అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. తైవాన్ చట్టాలను ఉల్లంఘిస్తూ అనుమతి లేకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం, అక్రమంగా ఉద్యోగులను నియమించుకోవడం ప్రధాన ఆరోపణలుగా నమోదయ్యాయి. తైవాన్ క్రాస్ స్ట్రెట్ చట్టం ప్రకారం చైనా సంస్థలు అక్కడ వ్యాపారం చేయాలంటే ముందస్తు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. అయితే పీట్ లౌ ఈ నిబంధనలను పట్టించుకోకుండా 2015లో హాంకాంగ్ కేంద్రంగా ఒక నకిలీ సంస్థను ఏర్పాటు చేసి, దాని ద్వారా తైవాన్‌లో రహస్యంగా బ్రాంచ్‌ను నడిపినట్లు దర్యాప్తులో తేలింది. ఈ శాఖలో 70 మందికి పైగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను నియమించి, మొబైల్ అనువర్తనాల పరిశోధన, అభివృద్ధి, పరీక్షల పనులు చేయించినట్లు అధికారులు గుర్తించారు. ఇందుకోసం సుమారు 2.3 బిలియన్ తైవాన్ డాలర్లను ఖర్చు చేసినట్లు, ఆ మొత్తాన్ని సాఫ్ట్‌వేర్ అమ్మకాల ఆదాయంగా చూపించి హాంకాంగ్ మార్గంలో తైవాన్‌కు మళ్లించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంలో పీట్ లౌకు సహకరించిన ఇద్దరు తైవాన్ పౌరులపై ఇప్పటికే కేసులు నమోదు చేశారు. ప్రపంచ టెక్నాలజీ రంగంలో కీలకమైన తైవాన్ ప్రతిభను దొంగచాటుగా వినియోగించుకోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని అధికారులు స్పష్టం చేశారు. గత ఏడాదిలోనే ఇలాంటి అక్రమ నియామకాలకు పాల్పడ్డ 16 చైనా కంపెనీలపై తైవాన్ చర్యలు తీసుకున్న నేపథ్యంలో ఈ కేసు మరింత సంచలనంగా మారింది.

# ఐఫోన్ ప్రో మాక్స్‌పై ఏకంగా 24000 తగ్గింపు..

**వేద న్యూస్ డెస్క్:**

ఫ్లిప్‌కార్ట్ వేదికగా ఐఫోన్ 16 ప్రో మాక్స్ స్మార్ట్ ఫోన్‌పై భారీ ధర తగ్గింపు అందుబాటులోకి వచ్చింది. గతంలో అధిక ధర కారణంగా కొనుగోలు వాయిదా వేసుకున్న వినియోగదారులకు ఇది బంగారు అవకాశంగా మారింది. 2024లో విడుదలైన ఈ ప్రీమియం ఫోన్ ఇప్పుడు కేవలం 114000 ధరకు లభిస్తోంది. ప్రారంభ ధరతో పోలిస్తే సుమారు 24000 వరకు తగ్గింపు రావడం విశేషం. బ్యాంక్ కార్డ్ రాయితీలు, పాత ఫోన్ మార్పిడి ఆఫర్లతో కలిపితే వినియోగదారులు మొత్తం 68000 వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంది. యాక్సిస్ బ్యాంక్ లేదా ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేస్తే అదనంగా 4000 వరకు తగ్గింపు లభిస్తోంది. ఇంట్లో ఉన్న పాత ఫోన్‌ను మార్పిడి చేస్తే మరింత భారీ ప్రయోజనం పొందవచ్చు. ఈ ఐఫోన్ మోడల్ టైటానియం బాడీతో తయారై తేలికగా ఉండటంతో పాటు బలంగా ఉంటుంది. కొత్త తరం ఏ18 ప్రో ప్రాసెసర్‌తో వేగవంతమైన పనితీరు అందిస్తుంది. భారీ గేమింగ్, వీడియో ఎడిటింగ్, మల్టీ టాస్కింగ్ వంటి పనులు ఎలాంటి ఆలస్యం లేకుండా సాఫీగా చేయవచ్చు. దీర్ఘకాలం పాటు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ లభించేలా రూపకల్పన చేయడంతో భవిష్యత్ వినియోగానికి కూడా భరోసా కలుగుతోంది. కెమెరా విభాగంలో కూడా ఈ ఫోన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అధిక స్పష్టతతో ఫోటోలు, వీడియోలు



తీయడానికి అనుకూలంగా అధునాతన కెమెరా సాంకేతికతను అందించారు. బ్యాటరీ సామర్థ్యం ఎక్కువగా ఉండటంతో ఒకసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే ఎక్కువసేపు వినియోగించుకోవచ్చు. మొత్తానికి ప్రీమియం ఫోన్‌ను తక్కువ ధరలో సొంతం చేసుకోవాలనుకునే వారికి ఇది అరుదైన అవకాశం. ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉండటంతో ఆసక్తి ఉన్నవారు త్వరగా నిర్ణయం తీసుకుంటే లాభం ఉంటుంది.

# సుజుకి నుంచి సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటర్..

**వేద న్యూస్ డెస్క్:**




ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో సుజుకి మరో ముందడుగు వేసింది. సుజుకి ఈ యాక్సెస్ పేరుతో కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. ఈ స్కూటర్ ధరను 188490గా ప్రకటించి బుకింగ్స్‌ను కూడా ప్రారంభించింది. ఇప్పటివరకు మార్కెట్‌లో ఉన్న ప్రముఖ స్కూటర్ల కంటే ఇది కొంత ఎక్కువ ధరలో లభిస్తున్నప్పటికీ ఫీచర్లు మాత్రం వినియోగదారులను ఆకట్టుకునేలా ఉన్నాయి. ఒక్కసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే సుమారు 95 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం ఉందని కంపెనీ వెల్లడించింది. ఈ స్కూటర్ తేలికపాటి ఛాసిస్‌తో రూపొందించబడింది. బ్యాటరీని ఫ్రేమ్‌లోనే అమర్చడం వల్ల స్కూటర్‌కు మంచి బలం లభిస్తోంది. మలుపులు తిప్పేటప్పుడు స్థిరత్వం మెరుగ్గా ఉంటుంది. నేరుగా ప్రయాణిస్తున్నప్పుడు కూడా అదుపులో ఉండేలా డిజైన్ చేశారు. భద్రతకు పెద్దపీట వేస్తూ బ్యాటరీ భద్రత, మన్నికపై ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ఎక్కువ ఉష్ణోగ్రతలు, తక్కువ ఉష్ణోగ్రతలు, నీటిలో మునిగిన పరిస్థితులు, కంపనాలు వంటి అనేక పరిస్థితుల్లో స్కూటర్ పనితీరును పరిశీలించిన తర్వాతే మార్కెట్‌లోకి విడుదల చేశారు.

వేద న్యూస్

గురువారం జనవరి 15, 2026

# ఓటీటీలోకి దూసుకొచ్చిన 'దండోరా'..



**వేద న్యూస్ డెస్క్:**

తెలంగాణ పల్లెటూరి నేపథ్యంతో, కుల వివక్ష వంటి సున్నితమైన సామాజిక అంశాన్ని తెరపై ఆవిష్కరించిన 'దండోరా' సినిమా ఇటీవల థియేటర్లలో మంచి విజయాన్ని అందుకుంది. ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసి మరింత మంది ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. నేటి నుంచే ప్రముఖ ఓటీటీ వేదికలో ఈ చిత్రం తెలుగుతో పాటు ఇతర భారతీయ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్‌కు వెళ్లలేని ప్రేక్షకులు కూడా ఇంట్లోనే ఈ కథను ఆస్వాదించే అవకాశం దక్కింది. ఈ సినిమాలో తెలంగాణలోని తుళ్లూరు గ్రామం కేంద్రంగా కథ సాగుతుంది. ఆ గ్రామంలో కుల వివక్ష ఎంతలా వేళ్లూనుకుపోయి ఉందంటే తక్కువ కులానికి చెందిన వారి అంత్యక్రియలు కూడా ఊరి దూరంగా నిర్వహించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ క్రమంలో అగ్రకులానికి చెందిన రైతు శివాజీ అకస్మాత్తుగా మరణించడంతో సమస్య మొదలవుతుంది. కొన్ని కారణాల వల్ల అతని శవాన్ని అగ్రకుల స్మశాన వాటికలో దహనం చేయడానికి పెద్దలు అడ్డుతగులుతారు. తండ్రికి గౌరవప్రదమైన అంత్యక్రియలు జరపాలనే లక్ష్యంతో కొడుకు విష్ణు, కూతురు సుజాత, గ్రామ సర్పంచ్ కలిసి పోరాటం మొదలుపెడతారు. అదే సమయంలో కుల రాజకీయాలు, హత్య కేసులు, వ్యక్తిగత జీవితాల్లోని మలుపులు కథను మరింత ఉత్కంఠగా మారుస్తాయి. చివరికి శివాజీకి న్యాయం జరిగిందా లేదా అన్నదే కథ సారాంశం. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు కీలక పాత్రల్లో నటించగా మురళీకాంత్ దర్శకత్వం వహించారు. భావోద్వేగాలు, సామాజిక సందేశం, గ్రామీణ వాతావరణం కలిసి ప్రేక్షకులను ఆలోచింపజేసేలా ఈ చిత్రం రూపొందింది. థియేటర్లలో మిస్ అయినవారికి ఇప్పుడు ఓటీటీలో చూసే మంచి అవకాశం లభించింది.


# 'తుంబాడ్ణ మాయ మళ్లీ మొదలైంది..




**వేద న్యూస్ డెస్క్:**

కల్ట్ క్లాసిక్‌గా పేరు తెచ్చుకున్న 'తుంబాడ్ణ దర్శకుడు రాహి అనిల్ బార్వే నుంచి మరో సంచలన చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'మయసభ'. ఈ సినిమాకు సంబంధించిన టీజర్ తాజాగా విడుదలై సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'తుంబాడ్ణ తరహాలోనే ఈ చిత్రంలో కూడా ఒక విభిన్నమైన ప్రపంచాన్ని చూపించబోతున్నారని టీజర్ చూస్తే స్పష్టంగా తెలుస్తోంది. ప్రధాన పాత్రలో నటిస్తున్న జావేద్ జాఫ్రీ ఇప్పటివరకు ఎప్పుడూ చూడని కొత్త అవతారంలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు. ఆయన పాత్ర చుట్టూ తిరిగే మిస్టరీ, విజువల్ ఎలిమెంట్స్ సినిమా మీద భారీ అంచనాలు పెంచుతున్నాయి. వీణా జమ్కర్, దీపక్ దామ్లే, మొహమ్మద్ సమద్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. టీజర్‌లో చూపించిన సెట్స్, లైటింగ్, బ్యాక్ గ్రౌండ్ మూడ్ అన్నీ కలసి ఒక మాయాజాల ప్రపంచాన్ని సృష్టించినట్టుగా అనిపిస్తోంది. విజువల్ గ్రాండియర్‌తో పాటు కథలో ఉండే ఉత్కంఠ, రహస్యాలు ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తాయని చిత్ర బృందం నమ్మకం వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రం జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# అఫీషియల్ బాంబ్..! ఐకాన్ స్టార్‌తో లోకేష్ కనగరాజ్..




**వేద న్యూస్ డెస్క్:**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అభిమానుల కల ఎట్టకేలకూ నిజమైంది. గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఊహాగానాలకు ముగింపు పలుకుతూ అల్లు అర్జున్, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ కలయికను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. భోగి పండుగ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక ప్రకటన వీడియోతో ఈ భారీ ప్రాజెక్ట్‌కు తెరలేపారు. అల్లు అర్జున్ కెరీర్‌లో 23వ చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. గతంలో ఇదే సంస్థ నిర్మించిన భారీ విజయాలు ప్రేక్షకుల్లో అంచనాలను మరింత పెంచుతున్నాయి. సంగీతం అందించే బాధ్యతను ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ తీసుకున్నారు. సాంకేతికంగా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఈ సినిమా రూపొందనుందని చిత్రవర్గాలు తెలిపాయి. విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు, కథ నేపథ్యం అన్నీ కొత్త స్థాయిలో ఉండబోతున్నాయనే టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ మరో భారీ చిత్రంలో బిజీగా ఉండగా, ఆ సినిమా పూర్తైన తర్వాత ఈ కొత్త ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందే ఈ సినిమా అభిమానులకు పూర్తి స్థాయి మాస్ వినోదాన్ని అందించనుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ లోకేష్ సృష్టించిన ప్రత్యేక సినీ ప్రపంచంలో భాగమవుతుందా లేదా అన్న దానిపై ఇప్పటికీ అధికారిక స్పష్టత రాలేదు. అయినప్పటికీ ఈ కాంబినేషన్ ప్రకటించగానే అభిమానుల్లో ఉత్సాహం తారస్థాయికి చేరింది. మొత్తంగా ఈ కలయికతో బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు నమోదు కావడం ఖాయమని సినీ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని ఆసక్తికర విషయాలు వెల్లడి కానున్నాయి.

# 'అనగనగా ఒక రాజు' ఎలా ఉంది..


## – నవీన్ నవ్వించాడు కానీ పూర్తి స్థాయిలో గెలవలేకపోయాడా..?



**వేద న్యూస్ డెస్క్:**

ఏజెంట్ సాయిశ్రీనివాస్ ఆత్రేయ, జాతిరత్నాలు, మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న నవీన్ పొలిశెట్టి నుంచి చాలా గ్యాప్ తర్వాత వచ్చిన సినిమా 'అనగనగా ఒక రాజు'. సంక్రాంతి బరిలో భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రంలో నవీన్ జమీందార్ వంశానికి చెందిన రాజు పాత్రలో కనిపించాడు. గోదావరి జిల్లాల నేపథ్యంతో సాగే ఈ కథలో ఆస్తులన్నీ పోయినా పరువు మాత్రం నిలబెట్టుకుంటూ కోటీశ్వరుడినని ఊరిని నమ్మిస్తూ బతికే యువకుడిగా నవీన్ నటన ఆకట్టుకుంటుంది. అవమానంతో రగిలిపోయి కోటీశ్వరుడి అల్లుడిగా మారాలనే సవాల్‌తో ముందుకెళ్లే రాజు ప్రయాణమే కథకు ఆధారం. పక్క ఊరి జమీందార్ కుమార్తె చారులతగా మీనాక్షి చౌదరి కనిపించింది. ఆమె కూడా తన జీవితంలో నిజాన్ని దాచి బతికే పాత్ర కావడంతో ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు ఆసక్తిగా సాగుతాయి. ప్రేమ, పెళ్లి వరకు కథ సరదాగా నడిచినా, పెళ్లి తర్వాత వచ్చే మలుపులు కొంత ఊహించదగ్గవిగా అనిపిస్తాయి. ద్వితీయార్థంలో గ్రామ రాజకీయాలు, సమస్యలు, పరిష్కారాల వైపు కథ మళ్లడం వల్ల కథన వేగం తగ్గిన భావన కలుగుతుంది. నవీన్ పొలిశెట్టి తనదైన చురుకుదనంతో, టైమింగ్‌తో కొన్ని చోట్ల నవ్వించాడు. అయితే అతని గత చిత్రాల స్థాయి హ్యూమర్ మాత్రం పూర్తిగా కనిపించదు. ఎమోషనల్ సన్నివేశాల్లో, యాక్షన్ సీన్స్‌లో మాత్రం నవీన్ కొత్తగా ప్రయత్నించాడు. మీనాక్షి చౌదరి అందంగా కనిపిస్తూ తన పాత్రకు న్యాయం చేసింది. కథను కీలకంగా మలుపుతిప్పే పాత్రలో రావురమేశ్ తనదైన శైలితో బలంగా నిలిచాడు. సంగీతం పర్వాలేదనిపిస్తుంది. పాటల్లో కొన్ని మాత్రమే గుర్తుండిపోయేలా ఉన్నాయి. ఛాయాగ్రహణం, నిర్మాణ విలువల్లో నిర్మాతలు రాజీ పడలేదు. అయితే కథ, కథనం విషయంలో ఇంకాస్త బిగువుగా ఉంటే సినిమా స్థాయి మరోలా ఉండేదన్న భావన కలుగుతుంది. మొత్తం మీద 'అనగనగా ఒక రాజు' కామెడీని ఇష్టపడే వారికి ఒకసారి చూడదగ్గ చిత్రంగా నిలుస్తుంది. మొత్తం రేటింగ్ : 2.75/5.

# మరోసారి ర్యాంకింగ్స్ సింహాసనం.. నంబర్ 1కి దూసుకెళ్లిన కోహ్లీ..!




**వేద న్యూస్ డెస్క్:**

భారత స్టార్ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ మరోసారి తన సత్తా చాటాడు. అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానాన్ని దక్కించుకుని ప్రపంచ క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని మరింత బలపరిచాడు. తాజా ర్యాంకింగ్స్‌లో కోహ్లీకి 785 పాయింట్లు లభించగా అగ్రస్థానంలో నిలిచాడు. ఇటీవల జరిగిన కీలక మ్యాచ్‌ల్లో నిలకడైన ప్రదర్శన కనబరిచిన కోహ్లీ వరుసగా పరుగుల వరద పారించాడు. గత కొద్ది రోజులుగా గిల్, కేన్, ఇతర అగ్ర బ్యాట్స్‌మన్‌లతో తీవ్ర పోటీ ఎదురైనా కోహ్లీ తన అనుభవం, క్లాస్‌తో ముందంజలో నిలిచాడు. ఇప్పటివరకు మొత్తం 28068 పరుగులు చేసి క్రికెట్ చరిత్రలో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 34357 పరుగుల మార్క్‌కు చేరువలో ఉన్నాడు. భారత అభిమానులు ఈ విజయంపై ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మాధ్యమాల్లో కోహ్లీకి అభినందనల వెల్లువ కురుస్తోంది. మరోసారి ప్రపంచానికి తన గొప్పతనాన్ని నిరూపించిన కోహ్లీ భారత క్రికెట్‌కు గర్వకారణంగా నిలిచాడు.

# పాక్ సంతతి ఆటగాళ్లకు వీసా నో అన్న వార్తల్లో నిజమెంత..?




**వేద న్యూస్ డెస్క్:**

ప్రతిష్ఠాత్మక పోట్టి ప్రపంచకప్ 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనుండగా, టోర్నీకి ముందే మరో వివాదం తెరపైకి వచ్చింది. అమెరికా క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న పాక్ సంతతి ఆటగాళ్లకు భారత్ వీసాలు నిరాకరించిందన్న ప్రచారం సోషల్ మాధ్యమాల్లో వేగంగా వ్యాపించి కలకలం రేపింది. ఫిబ్రవరి 7న భారత్‌తో తొలి మ్యాచ్ ఉండటంతో ఈ అంశం మరింత చర్చనీయాంశంగా మారింది. అలీ ఖాన్, జహంగీర్, మహ్మద్ మొహ్సిన్, ఆదిల్ అనే నలుగురు ఆటగాళ్ల వీసాలపై అనుమానాలు తలెత్తాయి. అలీ ఖాన్ తన సోషల్ మాధ్యమంలో చేసిన పోస్టు వల్ల వీసా తిరస్కరణ జరిగిందన్న ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఇది పూర్తిగా నిజం కాదని అధికారులు స్పష్టం చేశారు. వీసాలు తిరస్కరించలేదని, ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా జట్టు కొలంబోలో ఉన్నట్లు సమాచారం. జట్టులోని మిగతా సభ్యుల వీసా ప్రక్రియ అక్కడే పూర్తయ్యింది. అయితే పాక్ సంతతికి చెందిన నలుగురు ఆటగాళ్ల విషయంలో మాత్రం కొంత జాప్యం ఏర్పడింది. వారు భారత రాయబార కార్యాలయంలో అపాయింట్‌మెంట్ తీసుకున్నప్పటికీ, ఈ దశలో వీసా ప్రాసెస్ చేయలేమని సమాచారం అందిందని అధికారులు తెలిపారు. అనంతరం అవసరమైన కొంత సమాచారం మాత్రమే అందిందని, విదేశాంగ శాఖ నుంచి ఇంకా అదనపు వివరాలు రావాల్సి ఉందని తెలియజేశారు. అందువల్ల వీసాలు పూర్తిగా తిరస్కరించారన్న ప్రచారంలో నిజం లేదని స్పష్టత వచ్చింది. ప్రక్రియ పూర్తయ్యే వరకు కొంత సమయం పట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

# వరుసగా రెండో హాఫ్‌సెంచరీతో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ క్లాస్..!

**వేద న్యూస్ డెస్క్ :** రాజ్‌కోట్ వేదికగా జరుగుతున్న భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో వన్డేలో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుతంగా ఆడి వరుసగా రెండో హాఫ్‌సెంచరీ నమోదు చేశాడు. తొలి వన్డేలో కూడా అర్ధ సెంచరీ చేసిన గిల్ ఈ మ్యాచ్‌లో 47 బంతుల్లో హాఫ్‌సెంచరీ పూర్తి చేసి అభిమానులను అలరించాడు. అనంతరం 53 బంతుల్లో 56 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద కైల్ జెమీసన్ బౌలింగ్‌లో మిచెల్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. టాస్ గెలిచిన కివీస్ జట్టు బౌలింగ్ ఎంచుకోవడంతో భారత్ బ్యాటింగ్‌కు దిగింది. 23 ఓవర్లు ముగిసే సరికి 3 వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసింది. ఓపెనర్ రోహిత్ శర్మ 38 బంతుల్లో 24 పరుగులు చేసి క్లార్క్ బౌలింగ్‌లో తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. తొలి వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. అనంతరం వన్‌డౌన్‌లో వచ్చిన విరాట్ కోహ్లీతో కలిసి గిల్ స్కోర్ బోర్డును వేగంగా కదిలించాడు.

# భారత్‌పై న్యూజిలాండ్ ఘన విజయం..

## – 7 వికెట్లతో సిరీస్‌లో సమం..!



**వేద న్యూస్ డెస్క్:**

భారత్‌తో జరిగిన రెండో వన్డేలో న్యూజిలాండ్ జట్టు అద్భుతమైన ప్రదర్శనతో 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 285 పరుగుల లక్ష్యాన్ని కివీస్ 47.3 ఓవర్లలో కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయవంతంగా ఛేదించింది. బ్యాటింగ్‌లో మిచెల్ శతకం బాది జట్టును గెలిపించడంలో కీలక పాత్ర పోషించాడు. అతడు 131 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరోవైపు యంగ్ 87 పరుగులు చేసి జట్టుకు బలమైన మద్దతు అందించాడు. భారత బౌలర్లు మధ్య ఓవర్లలో వికెట్లు తీయలేకపోవడంతో ప్రత్యర్థి బ్యాట్స్‌మన్‌లు సులువుగా పరుగులు సాధించారు. ఫీల్డింగ్‌లో కూడా భారత్ కొన్ని అవకాశాలను చేజార్చుకోవడంతో మ్యాచ్ పూర్తిగా న్యూజిలాండ్ వైపు వెళ్లింది. ఈ విజయంతో సిరీస్‌లో పోటీ మరింత ఉత్కంఠగా మారింది. ఇక మూడో వన్డే జనవరి 18న ఇండోర్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్‌లో సిరీస్ విజేత ఎవరో తేలనుండటంతో క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి పెరిగింది

# పాకిస్థాన్‌తో మూడు టి20లు..



**వేద న్యూస్ డెస్క్:**

రాబోయే పొట్టి ప్రపంచకప్‌కు సిద్ధమయ్యే క్రమంలో ఆస్ట్రేలియా జట్టు పాకిస్థాన్‌తో మూడు టి20 మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్ ఈ నెల 29 నుంచి ప్రారంభం కానుంది. లాహోర్‌లోని గడాఫీ మైదానంలో జనవరి 29, 31 మరియు ఫిబ్రవరి 1 తేదీల్లో ఈ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ప్రపంచకప్‌కు ముందు ఆటగాళ్ల ఫామ్‌ను పరీక్షించుకునేందుకు ఈ సిరీస్ ఎంతో కీలకంగా మారనుంది. ప్రపంచకప్ పోటీలు భారత్, శ్రీలంక వేదికలుగా జరగనున్నాయి. ఆస్ట్రేలియా తన ప్రపంచకప్ మ్యాచ్‌లను భారత్‌లో ఆడనుండగా, పాకిస్థాన్ తన మ్యాచ్‌లన్నింటిని శ్రీలంకలో ఆడనుంది. గతంగా 2022 ఏప్రిల్‌లో ఆస్ట్రేలియా జట్టు చివరిసారిగా పాకిస్థాన్‌లో పర్యటించింది. జనవరి 28న ఆస్ట్రేలియా జట్టు పాకిస్థాన్‌కు చేరుకోనుంది. గత ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా కొన్ని మ్యాచ్‌లు పాకిస్థాన్ వేదికగా జరిగిన సంగతి తెలిసిందే. ఆసీస్‌తో జరిగే ఈ సిరీస్‌కు సంబంధించిన పాకిస్థాన్ జట్టును త్వరలో ప్రకటించనున్నారు. ఈ అంశంపై పాక్ కోచ్ మైక్ హెస్సాన్, కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా సమావేశమై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సిరీస్‌లో ఇరు జట్లు తమ బలాబలాలను పరీక్షించుకొని ప్రపంచకప్‌కు సిద్ధమయ్యే లక్ష్యంతో బరిలోకి దిగనున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073